
# కనిపించని చీకటి

యం. ఉమామహేశ్వరరావు



ఉదయం ఆరు గంటలు, అప్పటికే పెద్దాసుపత్రి అవుట్ పేషెంట్ వార్డు గేటు దగ్గర గుంపులు గుంపులుగా పోగయిపోయారు జనం. ఒ.పి. చీటీలు వ్రాయించుకుని, జబ్బుల్ని పరిశీలించుకుందుకు ఎక్కడెక్కడి నుంచో వచ్చిన జనం వాళ్ళు వాళ్ళ కళ్ళలో బెంగ, దైన్యం చోటు చేసుకున్నాయి.

ఆ జనాలకు కాస్త దూరంలో సిమెంట్‌తో కట్టిన గచ్చు దిమ్మె మీద ఒక కాలు పైన పెట్టి, మరో కాలు నేల మీద ఆనించి గేటు నుంచి లోపలికి వచ్చేవాళ్ళ వంక పరిశీలనగా చూస్తున్నాడు జాకీ. నోట్లో బీడీ ఉంది. మాటి మాటికీ బీడీని పళ్ళతో నొక్కుతూ చిరాకు పడి పోసాగాడు.

ఛీ...ఛీ... ఎదవ మార్కు. ఎదవ మార్కు మూడు గుర్రాల మార్కు ఇయ్యరా ఎదవా అంటే నెంబరొన్నట. నెంబరొన్. ఛీ... అర్థపైసా బీడీ ముక్కకోసం అరగ్గిపుల్లలు దండగ.''

చేతిలోని బీడీని నేలకేసి కసిగా కొట్టాడు. ఆ దెబ్బతో కాస్త కోపం తగ్గింది కాని, కడుపులో ఆకలి మాత్రం తగ్గలేదు. '' ఇయాల పొద్దున్నే ఏ ఎదవ ముకం మూసినానో ...అరనయా పైసా లేదు. పైగా ఈ జనాలకి జబ్బులో పాటు తెలివి ఎలిపొచ్చేసింది. ఆల్లే లైను కట్టేసి ఒ. పి. సీటీలు రాయించేసుకుంటున్నారు. ఏ ఎదవ నాకొడుకూ 'సీటీ' కోసం కనిపించలేదు.

చావని ఆశలో జనం వేపు చూస్తున్నాడు. అనుకుంది. ''ప్ప లాభంలేదు. మరో గంటయితే సాలు. ఒ. పి. కట్టేసి ఎలిపోతరు ఇస్తనాటం గోరు...''

ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఆబగా జనం కేసి చూస్తున్నాడు. వో. పీ. చీటీల దగ్గర లైను చాలా పెద్దదే ఉంది, చిన్నా, పెద్దా, ముసిలీ ముతకానూ.

చిరాకుతో అలాగే వెనక్కి వాలబోయి టక్కున లేచి నించున్నాడు. ఎదురుగా ఎవరో ఆసామీ.

''ఏం కావాలి సార్! వో. పీ. సీటి రాయించాలా? అబ్బెబ్బె... మీరా లైనులో నుంచుంటే ఇయ్యాల కాదు మరో రెండ్రోజుల దాకా సీటీ రాయించ లేరు.''

ఆగి ఆత్రతగా ఆ వ్యక్తి ముఖంలోకి చూశాడు.

అతను మామూలుగా ఉన్నట్టు లేడు. మనిషి ఏదో బాధతో మెలి తిరిగి పోతున్నట్టుగా కనిపిస్తున్నాడు. దాదాపుగా ఏభై సంవత్సరాలు పైనే ఉండొచ్చు.

దొరికిన మనిషిని వదలకూడ దనుకున్నాడు జాకీ ''మీ పేరూ, వయసూ రాసిచ్చేయండి దీని మీద.''

నేలమీద పడున్న ఖాళీ సిగరెట్ పాకెట్ నాలుక తీసి జేబులోని పెన్సిలు ముక్కతో పాటు అందించా డతనికి.

అతను గబగబా ఏదో గీసి ఇచ్చాడు. ఆత్రంగా దాన్నందుకుని లైను వేపు కదిలాడు జాకీ.

ఆ ఆసామీ అంతవరకూ జాకీ కూర్చున్న సిమెంట్ దిమ్మ మీద ఊసూరుమంటూ చతికిలపడ్డాడు.

అయిదు నిమిషాలు గడిచాయి.

చేతిలో వో. పీ. చీటీతో పరుగెత్తు కొచ్చాడు జాకీ.

''ఇదిగో సార్ మీ సీటీ. తిన్నగా పదమూడో నెంబరు గదిలో కెంచీలుంటాయి. ఆడకెళ్ళి కూకోండి డాకటేరు బాబు వత్తాడు.'' అని ఆగి అతని వేపు చూశాడు.

అతను మాట్లాడలేదు వెంటనే. రెండు క్షణాల తరవాత నోరు విప్పేడు.

''ఆ పదమూడో నెంబరు గది ఎక్కడుందో నువ్వే సెప్పవయ్యా'' అన్నాడు.

అతన్ని చూసి జాలేసింది జాకీ కి.

కాస్సేపు ఏదో ఆలోచించి ''నాతో రండి'సార్! అంటూ కదిలాడు. అతనూ జాకీ వెనకాలే అడుగులు వేశాడు.

ఇదంతా దూరంగా ''సుఖరోగుల' వార్డుకు దగ్గర్లోనే ఉన్న విరిగిపోయిన బెంచీ మీద కూర్చున్న 'ఇస్పేటు' చూస్తూనే ఉన్నాడు.

''ఎదవనాకొడుక ఎదవ... బలే పత్కోశీను మనిషిని. ఇకాడి పని గోయిందా... గోయిందా...''

ఇస్పేటు, జాకీ ఒకే జాతికి చెందుతారు. వాళ్ళ అసలు పేర్లు అవి కానే కావు. వాళ్ళు చేస్తున్న నెధవ బ్రోకరు పన్లకి పేక ముక్కల్లోని పేర్లు తగిలించేశా రక్కడి వాళ్ళు. అప్పటి నుంచి ఆ పేర్లే వాళ్ళకు స్థిరమై పోయాయి. పెద్దాసుపత్రిలో వైద్యం చేయించుకోవడానికీ, జాయినవడానికీ వచ్చే రోగులకు దగ్గరుండి, వో.పీ. చీటీలు వ్రాయించి ఆయా వార్డుల్లో కూచోపెట్టి, ఆనక వాళ్ళ దగ్గర అర్ధో, రూపాయో గుంజుతారు.

ఈ దేశంలో దరిద్రానికీ, దాస్యానికీ లోటు లేదని జనశ్రుతి. పొట్టకోసం పాకీ పని సైతం చేసే వేశ్యావృత్తిలోనూ, కూటి కోసం శీలాన్ని పణం పెట్టే జీవాలూ కోకొల్లలు. ఇవన్నీ ఒక ఎత్తు. మంచిగా మాటలు చెప్పి, సాయం చేస్తున్నట్లు నటిస్తూ డబ్బులు గుంజుకుని బ్రతికే జీవితాలు మరో ఎత్తు.

*　　*　　*

పదమూడో నెంబరు గదిలోంచి ఆ ఆసామీ బయటకొచ్చే సరికి పదిన్నరయింది. బయట కాచుకుని కూచున్నాడు జాకీ.

"సీటీ... ఏది?"

అతను చీటీ అందిచ్చాడు.

అందుకుని చూశాడు. "ఫొటో తీయించుకోవాల, రక్తం పరీక్ష సేయించు కోవాల. అబ్బోసి, సేనా సేనా రాసేసినాడే డాకటేరు. ఈ కుర్ర డాకటేర్లు వచ్చిందగ్గరనుంచీ అన్నీ పరీచ్చలే."

తిన్నగా "ఎక్స్—రే" వార్డుకు తీసుకు వెళ్ళాడతన్ని. అక్కడ అప్పటికే జనం క్రిక్కిరిసిపోయి ఉన్నారు. గుండె అదిరిపోయింది ఆ పెద్దాయనకి. అయోమయంగా జాకీ వేపు చూశాడు.

"మీరేం బెంగ పడి ఇదై పోకండి సార్! ఎంత మంది జనంఉన్నా మీ ఫొటో మాత్రం అర్జంటుగా తీయించేసే పూచీ నాది." నిబ్బరంగా అన్నాడు జాకీ.

'జాకీ'ని చూస్తుంటే తన లాంటి నిర్భాగ్యులను ఇలాంటి ఆపదలో రక్షించడానికి పుట్టిన ఆ 'పరమేశ్వరుల్లా' కనిపించాడు.

ఫొటోలు తీసే వాడితో ఏదో మాట్లాడి వచ్చాడు జాకీ.

"ఓ రెండ్రూపాయలు ఇలగివ్వండి సార్ పనై పోద్ది బేగ."

ఆ ఆసామీ రెండ్రూపాయ లిచ్చాడు. వో.పీ చీటీ రెండ్రూపాయలూ కలిపి ఫొటో వాడి కిచ్చేశాడు. మరో పది నిముషాల్లో పని జరిగిపోయింది.

ఇస్మాయిలుకు పొద్దుట్నించి ఒక్క బేరమూ తగల్లేదు. బెంచీమీద కూర్చోడం మూలాన కాళ్ళు తిమ్మిర్లు పట్టేశాయి. కాలు విదిలించుకుంటూ చిరాకు పడిపోయాడు.

"సెత్! ఇంతమంది సానోళ్లూ, యబిసారులూ ఉన్నా రీ ఎదవ ఇసాకపట్నంలో ఒక్కత్తి వో కేసూ అంపింది గాదేం?"

ఇస్మాయిలు పనల్లా కేవలం సుఖరోగుల తోటే. అక్కడ మాత్రం వాడికి పోటీ లేదు. వార్డుకి దగ్గర్లోనే చెడిపోయి స్క్రాప్‌గా పడి ఉన్న డొక్కు అంబులెన్స్ వాన్ డొక్కులో పీక్కుపోయిన నార బొంత వేసుకుని పడుకుంటాడు రాత్రుళ్ళు. అప్పుడప్పుడు జాకీ కూడా అక్కడే చేరుతాడు.

"డాక్టరుగా రున్నారా?"

చిరాకులోంచి తుళ్ళిపడి ఎదురుగా చూశాడు. ఎదురుగా ఎవరో కుర్రాడు కాలేజీ స్టూడెంట్‌లా ఉన్నాడు. "ఇంకేం ! ఏదో 'పెద్దబాపతే' అయి ఉంటుంది. అసలీ ఆస్పత్రికి ఎందుకొస్తారో తెలీదు కుర్ర నాగన్నలకి. ఈ ఆసుపత్రిలో డాకటేర్లూ, నరుసులూ తప్పించి, ఇంకే ముంటాయి గనక!"

కుర్రాడు అలాగే నించున్నాడు.

"డాకటేరు గోరా... ఉన్నారు బాబూ... ఉండం డుండండి. సూసొత్తాను..."

కుర్రాణ్ణి బెంచీ మీద కూర్చోబెట్టి లోపలికి కదిలాడు. అర నిముషంలో బయటకు వచ్చేశాడు మళ్ళా.

ఆ కుర్రాడు ఎటో చూస్తున్నాడు. ముఖంలో మాత్రం దిగులు ఏ కోశానా ఉన్నట్లు లేదు. "ఈ కాలం కుర్రోళ్ళు అంత. లోప లోపల ముదిరి పోయి పెచ్చులూడిపోతా ఉన్నా పైకి చెప్పుకోలేరు. పేషనూ, పెస్టీజినూ. పైకి మాత్రం బంగారం నాగ తలతలామని మెరిసి పోతారు. ఒల్లు మాత్తరం తనికీ సేసి సూత్తే... ఇంకేటుంది, అంతా గుల్ల. మనస్సులోనే గొణుక్కుని చిన్నగా నవ్వుకున్నాడు.

"రండి బాబూ. రండి. రమ్మన్నరు...ఓ.పీ. సీటుందా?"

"ఉంది."


"అయితే రండి."

కుర్రాడు డాక్టరు గారి గదిలో కెళ్ళాడు. ఇస్మాయిలు మళ్ళీ బెంచీ మీద కూచున్నాడు లోపలికెళ్ళిన వాడికోసం చూస్తూ.

పది నిముషాలయింది. కుర్రాడు పైకి వచ్చేశాడు. ఇస్మాయిలు బెంచీ మీద నుంచి లేచాడు.

"ఏ దీసీటి? ఏటన్నరు?"

కుర్రాడు ఉలకలేదు. పలకలేదు. గుడ్లమ్మట నీళ్ళు తిరిగి పోతున్నాయి.



పరిస్థితి గ్రహించి [illegible] ఏటి అందుకుని చూశాడు.

"ఈ మందులు ఇక్కడెక్కడా లేవు." అతనివేపు చూస్తూ అన్నాడు.

ఏడ్వయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు కుర్రాడు.

ఇస్పేటుకి జాలేసింది, పాపం.

"చూడు బాబూ! ఈ ఆసుపత్రిలో డాకటేరులూ, నరసులూ, స్టాపులూ ఉన్నారు. గవర్నమెంటో డిచ్చిన మంచాలూ, దుప్పట్లూ, టూలు బల్లలూ ఉన్నాయి. కాని మందులు మాత్రం స్టాకు లేవు. అవి ఉండవు. ఎందు కుండవని మాత్తరం అడక్కు. అడ్తే... మరిప్పుడు నీకు మందులు కావాలి. అవి వాడకుంటే నీ జబ్బు ముదిరిపోద్ది." అని కుర్రాడివేపు చూశాడు.

అయోమయంగా చూస్తున్నాడు కుర్రాడు.

"ఇదిగో—ఈ సేతిలో పది రూపాయలెట్టు. పది నిముషాల్లో ఈ మందులు తెత్తాను. ఎక్కడో తెత్తాను. నా బుర్ర సిల్లు పడే నాగ తిరిగి తెత్తాను. లేకపోతే నా వృత్తి మీ ఒట్టు."

నిబ్బరంగానూ, ధైర్యంగానూ చెప్పేడు ఇస్పేటు. మరి మాట్లాడలేదు కుర్రాడు. జేబులోంచి పది రూపాయలు తీసి ఇస్పేటు చేతిలో పెట్టాడు.

"ఈ బెంచీ మీదనే కూరుసోండి. పది నిమిషాల్లోనే వచ్చేత్తాను."

పది రూపాయల నోటుతో గేటు దాటి పరిగెత్తాడు ఇస్పేటు.

* * *

"పద్దెనిమిదో నెంబరు వార్డులో రత్త[illegible] సేత్తారు. రత్త పరీచ్చ మాత్తరం జాగరత్తగా సేయించాల. అల్లన్నారే, అక్కడోల్లు యముడి ఇంట్రోతు ముండా కొడుకులు. జలగలు రత్తం పీల్చేసినట్టు మన రత్తం సీసాలకి సీసాలు లాగేత్తుంటారు. ఎవులో ఒకలు మనిసికి మనిసి తోడు లేకుంటే మన పని ఇక అయినట్టే..."

చెప్పడం ఆపి అతని వేపు చూశాడు జాకీ.

"బాబ్బాబూ, ఈ పనీ నువ్వే సేయించాల."

'జాకీ' కాళ్ళట్టుకున్నంత పని చేశాడతను.

"అమ్మమ్మ... పెద్దోల్లు... మీరు మాలాటి ఎదవల కాల్లు పట్టుకోడవా? ... సరే! రండి బాబూ ఆ పని జాగ్రత్తగా అయిందనిపించేసి ఎలిపోతాను."

రక్తం పరీక్ష చేసే పద్దెనిమిదో నెంబరు వార్డుకు అతన్ని తీసుకుని నడిచాడు జాకీ.

జనంతో క్రిక్కిరిసి ఉంది వార్డు. పేషెంట్ల కోసం వేసిన పది వరసల బెంచీలపై క్రిక్కిరిసి కూర్చున్నారు జనం. వరుసలో పెట్టిన ఒ. పీ. చీటీలు పెద్ద 'దొంతి' అయిపోయాయి.

మెల్లగా అక్కడి వాడితో చెప్పి మరో రెండ్రూపాయలతో ఆ పనీ కాస్త అయిందనిపించాక ఆ ఆసామీని తీసుకుని బయటకు వచ్చేశాడు జాకీ.

"నా పని ఇక్కడితో సరి. ఇక మీరూ, మీకు మందులు రాసిన డాకటేరు బాబూ చూసుకోవాల. పొద్దుటేల నుంచి నా పనే సేత్తా ఉన్నాను. మరి నాకు ఏమాత్తరం పడేత్తారో సడీండి. నా తోవ నాది మరి."

జాకీ ఇలా అనడంతో అతను జేబులో చెయ్యి పెట్టి అయిదు రూపాయల కాగితం పైకి తీసేడు.

"ఇదిగనోయ్... ఇది తీసుకో... ఫోటో కాడ రెండూ, రత్తం కాడ రెండూ—నీకు మాత్రం అయిదా... మొత్తం తొమ్మిది రూపాయలు ఖర్చు. ఇంకా ఆ డాక్టరు ఎంతడుగుతాడో తెలీదు." జాకీ వేపు కృతజ్ఞతతో చూస్తూ కదిలిపోయాడతను.

జాకీ తిన్నగా ఓ. పీ. గేటు దగ్గరికి వచ్చేశాడు. ఇస్పేటుగాడు కలిశా డక్కడ.

* * *

చీకటి పడింది. ఆసుపత్రిలో అక్కడక్కడా వార్డుల్లో దీపాలు వెలిగాయి. ఫేనులు తిరగడం లేదు. హెడ్‌స్టాపు అప్పలనరసమ్మ క్వాటర్లో. ఒందా వార్డులో. ఇంతలో స్టాపు వెంకన్న వచ్చాడు. కాస్త కంగారుగా ఉన్నాడు మనిషి.

"బేండేజీ గుడ్డల్లో చుట్టేసి ఆ మూటలు పెట్టి శాను. నా పనయిపోయింది. ఇక మీరే చూసుకుండి దాన్ని."

చెప్పేసి చరచరా వెళ్ళిపోయాడు.

హెడ్‌స్టాపు అప్పలనరసమ్మ చుట్టూ చూసింది. వార్డు వేపే వస్తున్న తోటీ రావులమ్మ కనిపించింది.

"ఇలా రా రావులా!" పిలిచింది.

తోటీ వచ్చింది. రహస్యంగా దాని చెవిలో ఏదో చెప్పింది.

గుటకలు మింగుతూ సరికి అలాగే నంది తోటీ.

అర్ధరాత్రి—ఆస్పత్రిలో అంతా నిద్రలో జారుకున్నారు. మూలనున్న బేండేజీ గుడ్డల్తో చుట్టిన ఆ మూట తీసుకుని తిన్నగా ఓ. పి. గేటు దగ్గరగా వచ్చింది తోటీ. గోడ పక్కనే కాపేసింది చెత్త కుండీ. గబగబా ఆ మూటను చెత్త అడుగున పెట్టి, పైన కొంత చెత్త పోసి చెమట పట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ తిన్నగా వార్డు లోపలికి జారుకుంది.

నిద్రరాక డొక్కు అంబులెన్సు రేకుల్లోదొర్లుతున్న ఇస్పేటు ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు. పక్కనే జాకీ మంచి నిద్రలో మునిగిపోయి ఉన్నాడు.

మెల్లిగా లేచాడు ఇస్పేటు. తిన్నగా చెత్తకుండీ దగ్గరగా వెళ్ళాడు. కాలు ముడుచుకునేందు కన్నట్లుగా వంగేడు.

* * *

"బాల్తిగా కిట్టదండి, రంగనాథంగోరూ. ఇందులో సాలుందికి వాటాలియ్యాల. మరో పచ్చా ఇప్పించండి."

ఆ నాటు బాపతు వైద్యుణ్ణి ప్రతిమాలసాగాడు ఇస్పేటు.

"చస్... నోరు ముయ్యి—ఈ ఇరవై రూపాయలు వాళ్ళే. సరిపోతాయి. అంతా పంచుకోండి." చిరాకు పడ్డాడు రంగనాథం ఆ మూట తీసుకుంటూ.

ఇస్పేటుకు కష్టం కలిగిందా మాటకు.

"నానొక్కణ్ణే అయితే మీ రెంతిత్తే అంత పుచ్చేసుకుని ఎలిపోదును. ఇందులో అప్పల నరసమ్మకీ, మేల్ స్టాపు ఎంకన్నగోరికీ, తోటీ రావులమ్మకీ వాటాలియ్యాల. అసలే ఆ ఆసుపత్రిలో మందులెల్లవు. వచ్చిన మందుల్ని ఇలగ దొంగతనంగా తెచ్చేసి అమ్మేసుకుంతన్నారని తెలిత్తే మా పేనాలు పోతాయి. అల్ల ఉద్యోగాలు వూడిపోతాయి."

ప్రాధేయపడసాగాడు ఇస్పేటు. అతను మరి నయాపైసా ఇవ్వలేదు.

రెండో రోజు... ఆస్పత్రి అవుట్‌పేషెంట్‌వార్డు దగ్గిర మామూలుగానే ఒ. పీ చీట్లకోసం రద్దీగా ఉన్నారు జనం.

నలుగురు మనుషులు హడావుడిగా ఒక వ్యక్తిని చేతుల మీద మోసుకొచ్చారు. జాకీ గబగబా లేచి వచ్చాడు. ఇస్పేటు హడావుడిగా చేరా డక్కడికి.

"ఎమర్జెన్సీ కేసు. ఇంజీసను రియాక్షను ఇచ్చేసి నాడంట. వెంటనే ఎమర్జెన్సీలో వెయ్యాల!"

అంటూ లోపలికి మోసుకుపోయారతన్ని. 'జాకీ' మాత్రం గుడ్లప్పగించి అలాగే చూస్తూండి పోయాడు. అతను ఎవరో కాదు—తను దగ్గరుండి అన్ని పరీచ్చలూ సేయించి పంపేసిన మనిసి లోడే.

"పాపం పెద్దోడ—ఏ డాకటేరుని పట్టేనాడో ఏటో—ఏదో పడని ఇంజీసనో, [illegible]పోయిన ఇంజీసనో పేసేసి ఉంటాడా డకటేరు."

విచారించాడు జాకీ.

ఇంతలో లోపలకు వెళ్ళిన నలుగురూ గబగబా పైకి వచ్చేశారు.

"ఏటయినాది?..."

"పాపం ఎమర్జెన్సీ వార్డులో ఏయకముందే సెల్లిపోనాడు. డబ్బుల్లాలక ఎవురో పెంపవేటు డాకటేరు కాడ ఇంజీసను సేయించుకున్నాడంట."

ఎవరో అంటున్నారు.

"ఎవుడా పయివేటు డాకటేరు?"

విసుగ్గా, బాధగా అడిగాడు జాకీ.

"ఎవుడో రంగనాథమంట— నాటు వైద్యం బాపతు."

అంతే!

రంగనాథం పేరు వింటూనే నిశ్చేష్టుడై పోయాడు ఇస్పేటు.

ఈలోగా అప్పల నరసమ్మ వార్డులోని కుర్ర డాక్టరు తను పారేయించడానికని తీసిఉంచిన ఎక్స్‌పైరై పోయిన ఇంజక్షను బాటిల్సు కోసం వెతకసాగాడు. అవి కనిపించక పోవడంతో గతి పోయింది. హడావుడిగా వార్డులోకి ప్రవేశించిన ఇస్పేటు అప్పల నరసమ్మ చెవిలో అసలు విషయం వూదేడు. అప్పలనరసమ్మ నోట మాట రాలేదు. స్టాపు ఎంకన్న చేత దూదితో బేండేజీ లాగా చుట్టించేసి తోటి చేత బయటకు పంపేసిన మందులు, ఇంజక్షన్లు ఎక్స్‌పైరై పోయిన బాపతని తెలిసి నోరెండిపోయింది. అరగంట క్రితమే ఆ ఇస్పేటు గాడిచ్చిన పది రూపాయల నోటు తన ఒడిలో నాగుబాములాగా బుసలు కొడుతూ విషంకక్కుతున్నట్టు ఫీలయి ముఖం తిరిగి క్రింద గచ్చు మీద దభీమని పడిపోయింది. *